



వైభవంగా 'నమస్తే తెలంగాణ' ఎడిటర్ కుమారుడి వివాహం

నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, శ్రీలత దంపతుల కుమారుడు శ్రీకర కపర్ది శర్మతో గౌరీభట్ల శారదాప్రసాద్, విరజ దంపతుల కూతురు మనస్విని వివాహ మహోత్సవం ఆదివారం సిద్దిపేటలో వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సురభి వాణీదేవి, కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, బక్కి వెంకటయ్య, శంభీపూర్ రాజు, బాల్క సుమన్ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కంకల్‌లో కల్యాణీ చాళుక్య శాసనాలు

గుర్తించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

హైదరాబాద్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ): కల్యాణీ చాళుక్యుల శాసనాలను వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని కంకల్ గ్రామంలో గుర్తించినట్టు పురావస్తు పరిశోధకులు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. వీరభద్రాలయ ప్రాంగణంలో రెండు శిలాఫలకాలపై మూడు లభించగా, అవి కల్యాణీ చాళుక్యుల కాలానివిగా పరిశోధనలో తేలినట్టు పేర్కొన్నారు. కల్యాణీ చాళుక్య చక్రవర్తి భూలోకమల్లదేవ, 3వ సోమేశ్వరుడు తమ పాలనలో క్రీ.శ.1129 డిసెంబర్ 25, 1130 అక్టోబర్ 5, 1132 జనవరి 8న శాసనాలను లిఖించినట్టు చెప్పారు. భూములతోపాటు వివిధ దానధర్మాల వివరాలు సైతం ఈ శాసనాలపై ఉన్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ సమాచారం మేరకు తనతోపాటు శ్రీరామోజు హరగోపాల్ ఈ 3 శాసనాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్టు వివరించారు.

- బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల చెందిన కాంగ్రెస్ నాయకులు పలువురు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– భూత్పూర్

మోదీపై కార్టూన్..'వికటన్' వెబ్‌సైట్ నిలిపివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రధాని మోదీ అమెరికా పర్యటనపై తమిళ మ్యాగజైన్ 'వికటన్' ప్రచురించిన కార్టూన్ సంచలనం రేపింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. 'వికటన్' మ్యాగజైన్ వెబ్‌సైట్‌ను నిలిపివేస్తూ కేంద్ర సమాచార, ప్రసార శాఖ చర్యలు చేపట్టడం విమర్శలకు దారితీసింది. శుక్రవారం రాత్రి నుంచి 'వికటన్' వెబ్‌సైట్‌ను కేంద్రం బ్లాక్ చేసినట్టు తెలిసింది. కేంద్రం చర్యల్ని తమిళనాడు సీఎం స్టాలిన్ సహా పలువురు రాజకీయ నాయకులు ఖండించారు. చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులు కట్టి అమెరికా నుంచి భారతీయ వలసదార్లను బహిష్కరిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై మోదీ మౌనంగా ఉండటాన్ని ప్రశ్నిస్తూ 'వికటన్' మ్యాగజైన్ ప్రధాని నరేంద్ర మోదీ చేతులకు, కాళ్లకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంకెళ్లు వేసినట్టుగా కార్టూన్ ప్రచురించింది. ఫిబ్రవరి 10న మ్యాగజైన్ కవర్‌పేజీపై ప్రచురించిన కార్టూన్ వివాదాస్పదమైంది.

బయ్యారం ఉక్కుపై 'తుప్పు' మాటలు

- ఇనుప ఖనిజం నాణ్యత లేదన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణవాదుల ఆగ్రహం
- బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు నినాదాన్ని అవమానించారంటూ మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): బయ్యారం ఉక్కు కర్మాగారంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు. కిషన్‌రెడ్డి ఆదివారం హనుమకొండలో మాట్లాడుతూ.. 'మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే నిధులు వృథా అవుతాయి. ఆ ప్రాంతంలో దొరికేది నాసిరకం ఖనిజం' అని వ్యాఖ్యానించారు. 'బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు' నినాదాన్ని, విభజన హామీని కిషన్‌రెడ్డి అవమానించారని తెలంగాణవాదులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఖనిజం సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాల్సిందిపోయి ఫ్యాక్టరీ ఏర్పాటు వృథా అని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తున్నారు.

గనులు లేని విశాఖలో ప్లాంట్ ఎలా?

అసలు గనులే లేని విశాఖపట్టణంలో ఉక్కు ఫ్యాక్టరీని ఎలా ఏర్పాటుచేశారని తెలంగాణవాదులు కిషన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. ఎంతోకొంత ఖనిజ నిల్వలున్న బయ్యారంలో ప్లాంట్ పెడితే మాత్రం నష్టాలు వస్తున్నాయని కుంటిసాకులు చెప్తారా? అంటూ మండిపడుతున్నారు. విశాఖకు ఛత్తీస్‌గఢ్-ఒడిశాలోని బైలడిల్లా నుంచి ఇనుప ఖనిజం సరఫరా అవుతున్నదని చెప్తున్నారు. బైలడిల్లా నుంచి విశాఖకు మధ్య 550 కిలోమీటర్లకుపైగా దూరం ఉన్నదని, కానీ బయ్యారం-బైలడిల్లా మధ్య దూరం 160 కిలోమీటర్లు మాత్రమే అని చెప్తున్నారు. అయినా కేంద్రం బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుతో లాభాలు రావంటూ కుంటిసాకులు చెప్తున్నదని మండిపడుతున్నారు. అంతే కాదు, బైలడిల్లా నుంచి గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు ఇనుప ఖనిజాన్ని తరలించేందుకు కేంద్రం రెండేండ్ల క్రితం అనుమతులు ఇచ్చింది. ఈ రెండింటి మధ్య దూరం 1,800 కిలోమీటర్లు. గుజరాత్‌కు, విశాఖపట్టణానికి ఖనిజాన్ని సరఫరా చేసినప్పుడు లేని అభ్యంతరం బయ్యారానికి మాత్రమే ఎందుకు వస్తున్నదని కిషన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. ఇనుప ఖనిజం రవాణాకు స్లర్రి పైప్‌లైన్ లేదా రైల్వేలైన్ వేస్తే సరిపోతుందని కేసీఆర్ ప్రభుత్వం అనేకసార్లు కేంద్రానికి సూచించిందని గుర్తుచేస్తున్నారు. అవసరమైతే ఖర్చులో సగం వాటా భరించేందుకు కూడా సిద్ధమని ప్రతిపాదించినా కేంద్రం పట్టించుకోలేదని చెప్తున్నారు. దీనిని బట్టి బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టేందుకు కేంద్రానికి ఇష్టంలేదని స్పష్టమవుతున్నదని మండిపడుతున్నారు. అందుకే 'తుప్పు' మాటలు చెప్తున్నారని విమర్శిస్తున్నారు.

బీఎఫ్ఎస్ఐ-స్కిల్లింగ్ కోర్సుకు విశేష స్పందన

హైదరాబాద్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, డిగ్రీ పట్టభద్రుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) కోర్సుకు విశేష స్పందన లభిస్తున్నట్టు అధికారులు ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డాటా బేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ(వైఐఎస్‌యూ)లో శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని వారు పేర్కొన్నారు. ఐదు నెలలపాటు కొనసాగే ఈ కోర్సులో ప్రవేశాల కోసం ఆదివారం పరీక్ష నిర్వహించినట్టు, ఉత్తీర్ణత సాధించినవారికి జూలై వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. విద్యార్థులు అడ్మిషన్ ఫీజు కింద రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్లాంట్ పెడితే నిధులు వృథా

- బయ్యారం ఉక్కు నాసిరకం
- రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్,ఫిబ్రవరి 16 : మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే నిధులు వృథా అవుతాయని, ఆ ప్రాంతంలో దొరికేది నాసిరకం ఖనిజమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 14 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఏ సీఎం కూడా ప్రతివారం ఢిల్లీ చుట్టూ తిరుగలేదని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పోరాటాలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కుల గణన సర్వేను ఏ ఒక్క బీసీ సంఘం అంగీకరించడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు ఇస్తుందని, బీసీ సంఘాలు సమర్థిస్తే కుల గణనను కేంద్రం ఆమోదించేలా చేస్తామని హామీ ఇచ్చారు. వంద రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఒక్క కొత్త ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ల ద్వారా వచ్చిన ఉద్యోగాలను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని చెప్పారు. త్వరలోనే బీజేపీ కొత్త అధ్యక్షుడి నియమాకం జరుగుతుందని తెలిపారు.

రాజీవ్‌గాంధీ హిందువే కాదు

కేంద్రమంత్రి బండి సంజయ్

విద్యానగర్, ఫిబ్రవరి 16: రాజీవ్ గాంధీ అసలు హిందువే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్వదేశీ మేళా' ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన బండి సంజయ్ మాట్లాడారు. రాజీవ్‌గాంధీ హిందువు అయినందున ఆయన కుమారుడు రాహుల్‌గాంధీ కూడా హిందువేనని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరమన్నారు. రాజీవ్‌గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్‌ఖాన్ పార్శీ, ఆయన మతమే రాజీవ్‌గాంధీకి వర్తించినప్పుడు హిందువు ఎలా అవుతారని ప్రశ్నించారు. బీసీ కులగణన పేరుతో హిందువులకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. 10% ముస్లింలకు కేటాయించి, 42% బీసీలకు రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారో చెప్పాలని నిలదీశారు. బీసీ జాబితాలో నుంచి ముస్లింలను తీసేసి కేంద్రానికి పంపిస్తే ఆమోదం పొందేలా చేస్తామన్నారు.

తెలుగు సినిమా తొలి మహిళా నిర్మాత

కృష్ణవేణి ఇకలేరు





అలనాటి ప్రఖ్యాత నటీమణి, నిర్మాత, స్టూడియో అధినేత, బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణవేణి(102) ఆదివారం ఉదయం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. తెలుగు సినిమా నడక నేర్చుకుంటున్న కాలంలో వెండితెరని దేదీప్యమానం చేసిన నటీమణుల్లో కృష్ణవేణి ఒకరు. 1924 డిసెంబర్ 24న ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ కుగ్రామంలో కృష్ణవేణి జన్మించారు. ఆమె తండ్రి వృత్తిరీత్యా వైద్యులు. చిన్నతనం నుంచి కృష్ణవేణికి కళలంటే ఆసక్తి. అందుకే రంగస్థల నటిగా కెరీర్ ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఓ స్త్రీ రంగస్థల నటిగా రాణించడం అంటే పెద్ద సాహసం. చిన్నతనం నుంచి కృష్ణవేణిలో తెగువ, పట్టుదల, ఆత్మవిశ్వాసం మెండు. అందుకే అవేమీ పట్టించుకోలేదామె. తన దారితో తాను సాగిపోయారు. 1936లో వచ్చిన 'సతీ అనసూయ'తో బాలనటిగా చిత్రరంగ ప్రవేశం చేశారు. మోహినీ రుక్మాంగద, కచదేవయాని, మళ్లీ పెళ్లి చిత్రాలు కృష్ణవేణికి మంచి పేరు తెచ్చిపెట్టాయి. 1939లో నూజివీడు సంస్థానాధిపతి మీర్జాపూరం జమీందార్‌ని ఆమె ప్రేమ వివాహం చేసుకున్నారు. 1941లో తన భర్తతో కలిసి 'శోభానాచల పిక్చర్స్' అనే చిత్రరంగ సంస్థని స్థాపించి, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తొలి మహిళా నిర్మాతగా అవతరించారు కృష్ణవేణి. ఆ సంస్థలో ఆమె నిర్మించిన తొలి సినిమా 'ధక్షయజ్ఞం'(1941). తన సొంత బ్యానర్‌లో ఆమె నటించిన 'గొల్లభామ'(1947) కృష్ణవేణిని స్టార్ హీరోయిన్‌ని చేసింది. ఈలపాట రఘురామయ్య కథానాయకుడిగా వచ్చిన ఆ సినిమా ద్వారానే మహానటి అంజలీదేవి చిత్రసీమకు పరిచయం అయ్యారు. ఇక శోభనాచల స్టూడియోస్ నిర్మించిన మరో క్లాసిక్ 'కీలుగుర్రం'(1949). ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి, అక్కినేనిని మాస్ హీరోగా నిలబెట్టింది. ఇక కృష్ణవేణి జీవితంలో మరపురాని చిత్రం 'మనదేశం'(1949). ఆ సినిమా ద్వారానే విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, నటరత్న, పద్మశ్రీ నందమూరి తారకరామారావు వెండితెరకు పరిచయమయ్యారు. అందులో ఆయన పోలీసాఫీసర్‌గా చిన్న పాత్ర చేశారు. దేశం గర్వించదగ్గ ఆ మహానటుడ్ని వెండితెరకు పరిచయం చేసి, చరిత్రలో చెరగని స్థానాన్ని దక్కించుకున్నారు కృష్ణవేణి.

గానగంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత దర్శకునిగా పరిచయమైంది కూడా 'మనదేశం' సినిమాతోనే కావడం మరో విశేషం. ఈ సినిమా ద్వారానే పి.లీల గాయనిగా పరిచయమయ్యారు. ఆ విధంగా తెలుగు సినిమా లెజెండ్స్ ఎన్టీఆర్, ఘంటసాల, అంజలీదేవి, గాయని పి.లీల.. వీరందరికీ తొలి అవకాశాలిచ్చి ప్రోత్సహించారు కృష్ణవేణి. అక్కినేని 'శ్రీలక్ష్మమ్మకథ', కృష్ణవేణి టైటిల్ పాత్రతో వచ్చిన 'లక్ష్మమ్మ' ఈ రెండు సినిమాలు.. 1950లో ఒకేసారి విడుదలయ్యాయి. వీటి కథ కూడా ఒకటే. అయితే.. అక్కినేని 'శ్రీలక్ష్మమ్మ కథ' పరాజయం చవిచూడగా, కృష్ణవేణి 'లక్ష్మమ్మ' విజయాన్ని సాధించింది. అలాగే భీష్మ(1944), మదాలస(1948), పేరంటాళ్లు(1951) తదితర చిత్రాల్లో కూడా కృష్ణవేణి నటించారు.

ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమకు ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వారిలో 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు కూడా ఉన్నారు.

నాన్నగారి నట జీవితానికి తొలి అవకాశమిచ్చిన కృష్ణవేణిగారి మృతి బాధాకరం. తెలుగు సినీ చరిత్రలో కృష్ణవేణిది ప్రత్యేక అధ్యాయం. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎన్నో గొప్ప చిత్రాలను నిర్మించారు.. నటించారు. ఆమె మృతి వ్యక్తిగతంగా మాకు తీరని లోటు. కృష్ణవేణమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా.

- నందమూరి బాలకృష్ణ

నటి, నిర్మాత, నేపథ్య గాయనిగా కృష్ణవేణి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మహానటుడు ఎన్టీఆర్‌ని తెలుగు తెరకు కానుకగా ఇచ్చారు. ఆమె మరణం సినీ రంగానికి తీరని లోటు. కృష్ణవేణి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడ్ని ప్రార్థిస్తూన్నా..

- మాజీ ఎఫ్డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం

ఆ ఎపిసోడ్ అదిరిపోతుందట?

అగ్ర హీరో రామ్‌చరణ్‌కి ఇమిడియట్‌గా హిట్ కావాలి. దర్శకుడు బుచ్చిబాబు సాన ద్వితీయ విఘ్నాన్ని అధిగమించాలి. అందుకే వారిద్దరికీ 'ఆర్‌సి 16'(వర్కింగ్ టైటిల్) కీలకం. ప్రీప్రొడక్షన్ నుంచే ఈ సినిమాపై బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరచడానికి కారణం అదే. క్రీడా నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. తాజాగా ఈ సినిమా కథకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందట. ఈ ఎపిసోడ్ సినిమాలో కీ రోల్ పోషిస్తుందని టాక్. అందుకే ఈ ఎపిసోడ్‌ని ఎమోషనల్‌గా ప్లాన్ చేశాడట బుచ్చిబాబు. రీసెంట్‌గా విడుదలైన రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్'లోనూ ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉన్న విషయం తెలిసిందే. ఆ ఎపిసోడ్‌పై ఆడియన్స్‌లో మిశ్రమ స్పందన వచ్చింది. కానీ 'ఆర్‌సి 16' ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ని మాత్రం నెక్ట్స్ లెవల్‌లో ప్లాన్ చేశారట బుచ్చిబాబు. నెక్ట్స్ షెడ్యూల్‌లో ఈ బిగ్ ఎపిసోడ్‌ని చిత్రీకరిస్తారని సమాచారం. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, మైత్రీమూవీమేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

చిత్రం

వందకోట్లు దాటేసిన తండేల్

అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో బన్నీవాసు నిర్మించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో ఈ నెల 7న విడుదలైన ఈ సినిమా వందకోట్ల క్లబ్‌లోకి చేరినందుకు చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేసింది. అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో తొలి వందకోట్ల సినిమాగా ఇది నిలిచిందని ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. 'అన్-సీజన్‌లో విడుదలైనప్పటికీ, ఆదివారాలు తప్ప సెలవులు లేనప్పటికీ, హెచ్‌డీ వెర్షన్ తొలిరోజే లీకైనప్పటికీ.. ఆవేమీ 'తండేల్'పై ప్రభావం చూపించలేకపోయాయి. సెకండ్ వీకెండ్ ముగియక ముందే వందకోట్లకు పైగా వసూళ్లు సాధించింది. డొమెస్టిక్ మార్కెట్లోనే కాక, తెలుగు రాష్ట్రాల్లోని డిస్ట్రిబ్యూటర్స్‌కు కూడా 'తండేల్' లాభదాయకమైన వెంచర్ అయ్యింది. ఇప్పటికే బ్రేక్ ఈవెన్ అయి, లాభాల బాటలో పయనిస్తుంది. ఇంతటి విజయానికి కారకులైన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని మేకర్స్ ప్రకటనలో పేర్కొన్నారు.

పానిండియా డైరెక్టర్‌కి పచ్చజెండా..

'పుష్ప2'తో ఇండియన్ సినిమా రికార్డులన్నింటినీ స్మాష్ చేసేశాడు అల్లు అర్జున్. దాంతో ఆయన చేయబోయే సినిమా ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. టాలీవుడ్ టాప్ డైరెక్టర్లలో ఒకరైన త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా ఉంటుందనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగానే వినిపించింది. అయితే.. బౌండ్ స్క్రిప్ట్‌తోనే త్రివిక్రమ్ సెట్స్‌కి వెళ్లాలని ఫిక్స్ అయ్యారట. అందుకోసం కాస్త సమయం తీసుకోనున్నట్టు సమాచారం. ఈ వేసవిలో కొబ్బరికాయ కొట్టేసినా.. షూటింగ్ మాత్రం ఆలస్యం కానుందని తెలుస్తున్నది. అందుకే.. ఈలోపు అట్లీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే ఆలోచనలో ఉన్నారట బన్నీ. ఇది ఎప్పట్నుంచో అనుకుంటున్న కాంబినేషన్. అయితే.. కొన్ని కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతమైతే ఈ కాంబో దాదాపు ఫిక్స్‌యిందని, త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రానుందని బలంగానే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందులో కథానాయికగా జాన్వీకపూర్ ఫిక్స్ అయ్యిందట. 'పుష్ప2' ఐటమ్ నంబర్ కోసం జాన్వీని సంప్రదిస్తే 'నో' చెప్పంది. బన్నీతో ఐటమ్ సాంగ్ చేస్తే హీరోయిన్‌గా చేయడం ఆలస్యమవుతుందనే జాన్వీ 'నో' చెప్పిందట. తన అంచనా నిజమై.. అనుకున్నట్టే 'పుష్ప2' వెంటనే బన్నీతో ఛాన్స్ కొట్టేసింది జాన్వీ. అనిరుధ్ ఈ సినిమాకు స్వరాలను సమకూరుస్తారని సమాచారం. 'జవాన్'కి పనిచేసిన బృందంలో చాలామంది ఈసినిమా క్కూడా పనిచేస్తారట.

ఆ రోజుకోసం ఎదురుచూస్తున్నా

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను బయటపెట్టేసింది సహజనటి సాయిపల్లవి. ఆమెకు జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉందట. దానికి బలమైన కారణం కూడా ఉందట. ఆ విషయం గురించి ఆమె మాట్లాడుతూ 'పెళ్లప్పుడు కట్టుకోమని మా మామ్మ నాకు ఓ చీర ఇచ్చింది. అప్పుడు నాకు 21ఏళ్లు. అప్పటికింకా నేను సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వలేదు. అసలు ఆ ఆలోచనే లేదు. పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామని ఆ చీర దాచుకున్నాను. కొన్నేళ్లకు అనుకోకుండా 'ప్రేమమ్'తో నటిని అయ్యాను. 'ఫిదా'తో మంచి పేరొచ్చింది. ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్ఠాత్మక అవార్డు కూడా అందుకుంటాననే నమ్మకం వచ్చింది. అందుకే.. జాతీయ అవార్డు అనేది నిజంగా నాకొస్తే.. అప్పుడు మా మామ్మ ఇచ్చిన చీర కట్టుకొని ఆ అవార్డు అందుకోవాలి అని నిశ్చయించుకున్నా. నిజంగా అవార్డు వచ్చినా, రాకపోయినా.. ఆ చీర ధరించే వరకూ ఆ ఒత్తిడి మాత్రం నన్ను వదలదు.' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి. నిజానిక్కూడా ఈ దఫా సాయిపల్లవికి నేషనల్ అవార్డు పక్కా అని పలువురి అభిప్రాయం. 'అమరన్'లోని ఆమె నటనకు తప్పకుండా అవార్డు వస్తుందని చాలామంది నమ్ముతున్నారు. అదే జరిగితే సాయిపల్లవి ఒత్తిడి తీరుతుంది. అభిమానుల ఆకాంక్షా నెరవేరుతుంది.

ఫౌజీలో యువరాణిగా?

ప్రభాస్ 'ఫౌజీ' సినిమా నుంచి వస్తున్న అప్‌డేట్లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. నిజానిజాలు ఎలావున్నా.. వినడానికి మాత్రం ఆ వార్తలు ఉత్తేజాన్ని రేకెత్తిస్తున్నాయి. రీసెంట్‌గా ఈ సినిమాలో సాయిపల్లవి కీలక పాత్ర పోషిస్తున్నదనే వార్త మీడియా సర్కిల్స్‌లో హల్‌చల్ చేసింది. ఈ సినిమాలో ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందని, ఆ ఎపిసోడ్‌లో సాయిపల్లవి దర్శనమిస్తుందని చాలామంది రాసుకొచ్చారు. ఇప్పుడు మరో కొత్త వార్త మీడియా సర్కిల్స్‌లోనే కాదు, ఫిల్మ్ వర్గాల్లో కూడా బలంగా వినిపిస్తుంది. ఇందులో అలియాభట్ ఓ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నదట. కథ రీత్యా ఇందులో ఓ యువరాణి పాత్ర ఉంటుందట. ఆ పాత్రలో అలియా కనిపిస్తుందని మీడియా టాక్. ఇందులో అనుపమ్‌ఖేర్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్టు 'ఫౌజీ' మేకర్సే ప్రకటించారు. మరి అలియా విషయం ఎంత వరకు నిజమో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.